అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి

- సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- కార్యకర్తలు విజయమే లక్ష్యంగా పనిచేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- కోరుట్లలో పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం
- హాజరైన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

కోరుట్ల, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటు వేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని, తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని, కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మా అమ్మమ్మ ఊరు భీమారం మండలంలోని దేశాయిపేట అని, నాకు జగిత్యాల జిల్లాతో ఆత్మీయ అనుబంధం ఉన్నదన్నారు. గురువారం కోరుట్ల, మెట్‌పల్లి మండలం వెల్లుల్లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశాలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు రాక్షసంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్నది ఒరిజినల్ కాంగ్రెస్ కాదని, అది టీడీపీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. రైతులకు రైతు బంధు, రైతు బీమా, సాగునీరు, తాగు నీరు, పేదలకు అసరా ఫించన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి వ్యక్తిని మోసం చేసే వ్యక్తి అని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ వెనుక సీఎం, అమిత్‌షా, మోడీ హస్తం ఉందన్నారు. కాంగ్రెస్ వందరోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తొలిసారిగా పార్లమెంట్‌కు పోటీ చేసేందుకు కేసీఆర్ తనకు అవకాశం ఇచ్చారని, నన్ను గెలిపిస్తే కోరుట్ల అభివృద్ధికి బాటలు వేస్తానని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష ఓట్లు లక్ష్యంగా పని చేయాలి:

– విద్యాసాగర్‌రావు

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి లక్ష ఓట్లు వేయించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీకి మతకల్లోలాలు లేపడమే పని అని, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల మధ్య అగాధం సృష్టించి ఓట్లు దండుకుంటున్నదని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మోదీ సర్కారు రాజకీయ లబ్ధికే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. జడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు చీకటే మిగిలిందన్నారు. సాగునీరు లేక రైతాంగం అల్లాడుతుంటే సర్కారు చోద్యం చూస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. నిజామాబాద్ నుంచి బాజిరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గులాబీ జెండా ఎగురవేద్దాం

–ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ నాయకుల అరచకాలు పెరిగిపోయాయన్నారు. ఐదేండ్లు ఎంపీగా ఉన్న ధర్మపురి అర్వింద్ ఏనాడు ఏ ఒక్క ఊరికి వచ్చిన పాపాన పోలేదన్నారు. పసుపుబోర్డు తీసుకువస్తానని గద్దెనెక్కిన ఆయన రైతులను మోసం చేశాడని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బడే భాయ్(మోదీ)తో చోటే భాయ్(రేవంత్‌రెడ్డి) కలిసిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. రేవంత్‌రెడ్డి, అర్వింద్‌కు దగ్గరి పోలికలు ఉన్నాయని, టీవీల దగ్గర కూర్చోవడం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ప్రజలు చుక్కనీటి కోసం గోస పడుతుంటే సీఎం రేవంత్ చోద్యం చూస్తున్నారని విమర్శించారు.ఇందులో బల్దియా చైర్‌పర్సన్ అన్నం లావణ్య, జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు అనిల్, రాజేశ్, ఎంపీపీ నారాయణ, వైస్ ఎంపీపీ సునీత, నాయకులు వెంకట్రావు, నారాయణరెడ్డి, భూంరెడ్డి పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కమనీయం.. కల్యాణోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్ యాస్మిన్ బాషా, మంత్రి పొన్నం ప్రభాకర్
- ధర్మపురిలో ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- అన్నదానానికి రూ.10వేల విరాళాన్ని అందజేసిన ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, మార్చి 21: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు గురువారం ఉదయం యాజ్ఞాచార్యులు పురుషోత్తమాచార్యుల మంత్రోచ్చారణల మధ్య పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. రాత్రి ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి(ఉగ్ర,యోగ), వేంకటేశ్వరస్వామిల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి అర్చకులు ఆలయానికి చేరుకున్న మంత్రికి ఘన స్వాగతం పలికారు. అంతకుముందు లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవానికి కలెక్టర్ యాస్మిన్‌బాషా ప్రభుత్వ పక్షాన పట్టువస్త్రాలు, తలంబ్రాలను అందజేశారు. పట్టువస్త్రాలతో ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు ఆలయ సిబ్బంది మేళతాళాల మధ్య ఘన స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో పండితులకు కలెక్టర్, స్వామి వారి పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు కలెక్టర్‌ను ఆశీర్వదించారు. కాగా, కల్యాణోత్సవంలో దాదాపు 10వేల మంది భక్తులు పాల్గొన్నారు. మొదట గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. పట్టణంలోని పాత టీటీడీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం, రైస్‌మిల్లర్లు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ రూ.10వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కల్యాణోత్సవంలో ఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు రవీందర్, మల్లేశం, సత్యనారాయణ, మొగిలి, పురుషోత్తం, మహేందర్, సాయికిరణ్, గణేశ్, శ్రీకాంత్, మల్లేశ్, సుజాత, పవన్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- వైద్యాధికారులకు డీఎంహెచ్‌వో శ్రీధర్ సూచన

జగిత్యాల అర్బన్, మార్చి 21: సాధారణ ప్రసవాలతో కలిగే ప్రయోజనాలపై గర్భిణులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో స్త్రీ వైద్య నిపుణులతో డీఎంహెచ్‌వో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, వైద్యులు, ముఖ్యంగా స్త్రీ వైద్య నిపుణులు తోడ్పాటు అందించాలన్నారు. సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపేలా పోస్టర్లు, కరపత్రాలు ముద్రించి అందించాలన్నారు. వ్యాయామ విధానాలు తెలిపేలా పోస్టర్స్‌ను దవాఖానల్లో అంటించాలని సూచించారు. శారీరక వ్యాయామాల ప్రాముఖ్యాన్ని గర్భిణులకు తెలియజేయాలన్నారు. గత సంవత్సరం జిల్లాలో అత్యధిక శాతం సాధారణ ప్రసవాలు చేసిన వైద్యులను సన్మానించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సమియుద్దీన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్‌రెడ్డి, సీనియర్ వైద్య నిపుణులు మంగాదేవి, రామేశ్వరి, ప్రభాకర్, ఐఎంఏ అధ్యక్షులు, సెక్రటరీలు, స్త్రీ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

'చల్మెడ' పరామర్శ

రాధ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చల్మెడ, నాయకులు

కథలాపూర్, మార్చి 21: అంబారిపేట మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్ భార్య రాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని గురువారం వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, వారిని ఓదార్చారు. అనంతరం రాధ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీ జవ్వాజి రేవతి, జడ్పీటీసీ నాగం భూమయ్య, బీఆర్ఎస్ నాయకులు చీటి విద్యాసాగర్‌రావు, వేముల గంగరాజం, వర్ధినేని నాగేశ్వర్‌రావు, మామిడిపెల్లి రవి, కల్లెడ శంకర్, ముస్కరి కిరణ్, గంగారాం తదితరులున్నారు.

'ఉపాధి' పనుల్లో బయటపడ్డ స్థూపాకార శిలలు

ఎల్కాలదేవి గుట్ట వద్ద బయటపడ్డ స్థూపాకార శిలలు

వెల్గటూర్, మార్చి 21: ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామ సమీపంలోని ఎల్కాలదేవి గుట్టపై గురువారం ఉపాధి హామీ కూలీలు కందకాలు తవ్వే పనులు చేపడుతుండగా, చిత్ర విచిత్రమైన స్థూపాకార శిలలు బయటపడినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ జుంజుపెల్లి సురేశ్, ఉపాధి కూలీలు పేర్కొన్నారు. సుమారు 20కి పైగా రాతి శిలలు బయటపడ్డాయన్నారు. ఇందులో కొన్ని శివలింగం ఆకారంలో ఉండడంతో వెంటనే కూలీలు, గ్రామస్తులు వాటికి పూజలు చేశారు. ఇక్కడ ఎల్కాల దేవి ఆలయం ఉందని, అందుకే ఈ గుట్టకు ఎల్కాలదేవి అని పేరు వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ శిలలన్నీ భౌగోళిక నిర్మాణంలో భాగంగా ఏర్పడ్డాయని, ఇక్కడ మరిన్ని తవ్వకాలు జరిపితే, ఇలాంటి శిలలు చాలా బయటపడే అవకాశం ఉందన్నారు.

కనుల పండువగా వెంకన్న కల్యాణోత్సవం

పెగడపల్లి, మార్చి 21: మండల కేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. గండ్ర వెంకట్రావు–ప్రమీల, ప్రవీణ్‌రావు–అనూష దంపతులు, వేంకటేశ్వరస్వామి–అలివేలు మంగమ్మ ఉత్సవ విగ్రహాలను ఆలయ మండపంలో ప్రతిష్ఠించారు. పూజారులు గుండి శ్రీనివాస్‌శర్మ, వినయ్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా వారికి తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌యాదవ్, రాంచంద్రం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి

మారుతీనగర్, మార్చి 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలో పలు మండలాల బీసీ సంక్షేమ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌తో పాటు బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే బీసీ గురుకులాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలకు క్రిమిలేయర్‌ను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బీసీ విద్యార్థులకు వసతి, మెస్ చార్జీలను పెంచాలన్నారు. ఈ మేరకు పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు శంకర్, శ్రీకాంత్, సదానందం, అజయ్, వెంకటేశ్, శ్రీనివాస్, శివ, భూమేశ్వర్ ఉన్నారు.

సంస్కృతికి ప్రతి రూపం బోనాలు

నర్సంగాపూర్‌లో పోచమ్మ బోనాల ఊరేగింపులో భక్తులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల రూరల్/జగిత్యాల, మార్చి 20: పోచమ్మ బోనాలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిరూపం అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం నర్సంగాపూర్, వంజరిపల్లి గ్రామాల్లో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. కాగా, బోనాల ఊరేగింపులో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ భక్తులతో కలిసి నృత్యం చేశారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. అలాగే జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, గంగారెడ్డి, తిరుపతి, రాజనర్సయ్య, రాజిరెడ్డి, గంగారాం, రవి, శ్రవణ్, భక్తులు పాల్గొన్నారు.

నర్సంగాపూర్‌లో బోనం ఎత్తుకున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, CHEKKABANDI APARNA, R/o. 2-75, Renikunta, Thimmapur, Karimnagar, TS. Changed My Name as CHEKKABANDI SUMALATHA, W/o. Devender Reddy.
NT-328433

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

ఇంకెన్నాళ్లీ డిప్యూటేషన్?

- అంజన్న ఆలయంలో ఓ ఉద్యోగి ఏండ్లుగా తిష్ఠ
- గడువు ముగిసినా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగింపు
- సర్వత్రా విమర్శలు

మల్యాల, మార్చి 21: దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని ఆలయాల ఉద్యోగులను ఇతర ఆలయాల అవసరార్థం డిప్యూటేషన్‌పై నియమించుకునే అవకాశమున్నది. అది కూడా గరిష్ఠ గడువు ఐదేండ్ల కాలపరిమితికి మించొద్దనే నిబంధన కూడా ఉన్నది. కానీ, కొండగట్టు అంజన్న ఆలయంలో పనిచేస్తున్న ఓ జూనియర్ అసిస్టెంట్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఏండ్లకేండ్లు డిప్యూటేషన్‌పై కొనసాగించడం విమర్శలకు తావిస్తున్నది. కరీంనగర్ జిల్లా పరిధిలోని ఓ ఆలయ ఉద్యోగి (జూనియర్ అసిస్టెంట్) 2009లో కొండగట్టు దేవస్థానానికి డిప్యూటేషన్‌పై వచ్చాడు. ఆలయ అవసరాల రీత్యా దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ అయితే పలు దఫాలుగా అతని డిప్యూటేషన్‌ను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సదరు ఉద్యోగి డిప్యూటేషన్ గడువు 2021 మార్చి 31తోనే ముగిసిపోగా, ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదేంటని అడిగితే తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా కొనసాగేలా కమిషనర్ ఆదేశాలు (అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్స్) ఉన్నట్లు సదరు ఉద్యోగి అందరినీ నమ్మబలుకుతూ వస్తున్నాడు. కానీ, లోతుగా పరిశీలిస్తే అసలు 'అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్స్' రాలేదనే విషయం తెలుస్తున్నది. మూడేండ్లుగా ఎటువంటి ఉత్తర్వులు లేకుండానే కొనసాగుతున్నట్లు వెలుగులోకి వస్తున్నది. సదరు ఉద్యోగి 15 ఏండ్లుగా ఇక్కడే తిష్ఠవేసినా ఎవరూ పట్టించుకోకపోవడం ఆరోపణలకు తావిస్తున్నది. రూల్స్ ప్రకారం సదరు ఉద్యోగి డిప్యూటేషన్ రద్దు చేసి రీప్యాట్రేషన్ లేదా కమిషనర్‌కు సరెండర్ చేయాల్సి ఉంటుంది. కానీ, ఆ దిశగా చర్యలు చేపట్టకపోగా, ఇటీవల జరిగిన అంతర్గత బదిలీల్లో కీలకశాఖలను సదరు ఉద్యోగికి అప్పగించడంపై మిగతా ఉద్యోగులు మండిపడుతున్నారు. ఇంకెన్నాళ్లీ డిప్యూటేషన్ అంటూ చర్చించుకున్నారు. కాగా, ఈ విషయమై ఆలయ ఈవోను సంప్రదించగా, ఉద్యోగి డిప్యూటేషన్ గడువు ముగిసినందున ఏం చర్యలు చేపట్టాలనే విషయంలో దేవాదాయ కమిషనర్‌కు నివేదించి ముందుకుసాగుతామని చెప్పారు.

మెట్‌పల్లిలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్



పట్టణంలో పోలీసుల బలగాల కవాతు

మెట్‌పల్లి, మార్చి21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో సీఐఎస్ఎఫ్, పోలీస్ బలగాలతో గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు. ఆర్టీసీ డిపో వద్ద అదనపు ఎస్పీ (ఏఆర్) భీమ్‌రావు, స్థానిక డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఫ్లాగ్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించగా, కవాతు పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా మనోహర్ గార్డెన్స్ దాకా సాగింది. అడుగడునా పోలీస్ బలగాలపై విద్యార్థులు, మహిళలు పూలు చల్లి స్వాగతం పలికారు. ఇక్కడ మెట్‌పల్లి, కోరుట్ల సీఐలు నవీన్, సురేశ్‌బాబు, ఆర్ఐ రామక్రిష్ణ, సీఐఎస్ఎఫ్ సీఐ సచిన్‌వర్మ, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ ఎస్ఐలు చిరంజీవి, అనిల్, కిరణ్‌కుమార్, శ్యామ్‌రాజ్, నవీన్ ఉన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయి

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

దరాయికల్, మార్చి 21: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడాకారులు గెలుపోటములను సమంగా స్వీకరించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. అల్లీపూర్‌లో అల్లీపూర్ ప్రీమియం లీగ్ సీజన్–3 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విజేత ముఖీద్ ఛాలెంజర్స్, రన్నరప్ మ్యాలపు మురళి కింగ్స్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో క్రీడలకు పెద్ద పీట వేశామన్నారు. రాయికల్ మండలంలో 24 క్రీడా మైదానాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రాజలింగం, ఎంపీటీసీ విజయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు ముఖీద్, మాజీ ఉప సర్పంచ్ సాగర్‌రావు, రత్నాకర్‌రావు, యూత్ అధ్యక్షుడు ప్ర శాంత్, నాయకులు గోపి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్/సారంగాపూర్, మార్చి 20: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చింత నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే పుట్ట గంగారాం అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సౌజన్య, గ్రామాధ్యక్షుడు ఆరే రవి, నాయకులు నక్క హరీశ్, మహేశ్, మల్లేశ్, శేఖర్, కరుణాకర్, రాజేందర్, సలీం తదితరులు పాల్గొన్నారు. సారంగాపూర్ మండలం అర్పల్లికి చెందిన లక్ష్మి, గంగరాజం, పెంబట్లకు చెందిన దుసర దుబ్బయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే గురువారం రాత్రి దవాఖానకు వెళ్లి వారిని పరామర్శించారు. అలాగే బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామానికి చెందిన రాజేందర్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

లోక్‌సభ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఓటరు స్వేచ్ఛగా, నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు జిల్లాలో పటిష్ట ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. డబ్బు, మద్యం ఇతర జిల్లాల నుంచి జిల్లాకు రవాణా కాకుండా నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సోషల్ మీడియాపై నిఘా కోసం 24 గంటలు ఐటీ సభ్యులతో స్పెషల్ టీం ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వెయిలైన్స్ టీంలు, వీడియో టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటిస్తూ ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు రవాణా గురించి సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్‌డ్ గన్స్ ఉన్న వారు తమ ఆయుధాలను సరెండర్ చేయాలని నోటీసులు జారీ చేశామన్నారు. విద్వేషాలను రెచ్చగొట్టేలా, ఎన్నికల నియమాలను ఉల్లంఘించేలా, ఇతరులను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

జగిత్యాల టౌన్, మార్చి 21: జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవులు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్తీ ఖరీదుదారుల విన్నపం మేరకు సోమవారం హోలీ పండుగతో పాటు మంగళవారం సెలవు ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం నుంచి రైతులు యధావిధిగా ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్‌కు తీసుకురావచ్చని సూచించారు.

బోనమో.. పోచమ్మ

మల్యాల, మార్చి 21: మండలంలోని రామన్నపేటలో గురువారం ముత్యాల పోచమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. పిల్ల పాపలతో అందరూ సంతోషంగా ఉండాలని పోచమ్మకు బోనాలు తీసి నైవేద్యం సమర్పించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

జగిత్యాల టౌన్, మార్చి 21: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో అశోక్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో 70 రకాల మొక్కలను నాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, హరితహారం కో ఆర్డినేటర్ రాధాక్రిష్ణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మెట్‌పల్లి, మార్చి 21: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో కారు, ట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం స్థానిక సీఐ నవీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కంపెనీల్లో తనిఖీలు

కోరుట్ల, మార్చి 21: పట్టణంలోని బీడీ కంపెనీల్లో గురువారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా జనావాస ప్రాంతాల్లో బీడీ కట్టలకు బట్టీ పెడుతున్న కంపెనీ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ అంజయ్య, రమేశ్, రాజు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అడిషనల్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఎస్పీకి మొక్కను అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 21: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం వినోద్‌కుమార్ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌రావు బదిలీ కాగా, ఆయన స్థానంలో వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి 21: తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయాలై, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య(60) ఈత, తాటిచెట్లు గీస్తూ ఉపాధి పొందుతున్నాడు. గతనెల 22న గ్రామంలోని తాటివనానికి కల్లు తీసేందుకు వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కి కల్లు దింపుతుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి చెట్టు పైనుంచి పడిపోయాడు. గాయాలు కాగా, కరీంనగర్‌లో ఓ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఈనెల 20న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్, సంఘం మండలాధ్యక్షుడు మారుతిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

తనిఖీల్లో రూ. 3 లక్షలు సీజ్

కోరుట్ల/మల్లాపూర్, మార్చి 21: కోరుట్ల పట్టణంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలు లేకుండా బైక్‌పై తరలిస్తున్న రూ. 3 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆ నగదును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా, జిల్లా సరిహద్దు గ్రామమైన మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామ శివారులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద మెట్‌పల్లి సీఐ నవీన్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తనిఖీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

సారంగాపూర్, మార్చి 21: బీర్‌పూర్ మండలం కొల్వాయి, రాయికల్ మండలం అల్లీపూర్‌లో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్వాయి బీట్ పరిధిలోని అరగుండాల చెరువు వద్ద అటవీ శాఖ అధికారులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెరువు ప్రాంతంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. అల్లీపూర్‌లోని రైతులు, శ్రీ వాణి స్కూల్ విద్యార్థులకు అడవులు, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్ మాట్లాడారు. అడవులను పెంచడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామన్నరు. కొల్వాయిలో అటవీశాఖ అధికారులు గంగారాం, ప్రకాశ్, రాజేశం, రాజశేఖర్, అల్లీపూర్‌లో డీఆర్వోలు రవికుమార్, అరుణ్‌కుమార్, ఎఫ్ఎస్‌వో హమీద్, ఎఫ్‌బీవో నరేశ్, అటవీ శాఖ సిబ్బంది గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.